పాలకూర సీతాలత

# దొంగల ఫ్యాక్టరీ

దొంగల ఫ్యాక్టరీ అంటే నా ఉద్దేశ్యం దొంగల యొక్క ఫ్యాక్టరీ అని కాదు. దొంగల కొరకు నడపబడుతున్న ఫ్యాక్టరీ అని కూడా కాదు, దొంగల్ని తయారుచేస్తున్న ఫ్యాక్టరీ అని! ఆ ఫ్యాక్టరీ అవుట్‌పుట్ దొంగలన్నమాట. ఇన్‌పుట్ మంచి మనుషులు. కెటలిస్టు ఒక చెడ్డ ఆలోచన. ప్రోసెసింగ్ కాస్ట్‌కూడా పెద్ద ఎక్కువ కాదు. మనిషిని బట్టి ఆ కాస్ట్ కొంచెం మారుతుంది.

ఆ ఫ్యాక్టరీ ఎక్కడవుంది అని అడుగుతున్నారా! మా ఊళ్ళోనూ వుంది. మీ ఊళ్ళోనూ వుంది అంతెందుకు! ప్రతి ఊర్లోనూ వుంది. ఆ ఫ్యాక్టరీని నడిపేది మన చుట్టూవున్న సంఘమే.


మీకింకా నా ఉద్దేశ్యం పూర్తిగా అర్థంకాలేదు కదూ. అయితేమీరు సత్యమూర్తి గురించి తెలుసుకోవాలి. అతను మంచి మనిషి. ఈ ఫ్యాక్టరీలో అతను ఏరకంగా చిక్కుకుపోయి చెడ్డవాడు అయ్యాడో తెలుసుకుందాం?

* * *

ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న వాళ్ళకు ఎల్.టి.సి.అనే ఒక సౌకర్యం వుంది. అంటే లీవ్ ట్రావెల్ కన్సెషన్ అన్నమాట. రెండు సంవత్సరాలకు ఒకసారి ఉద్యోగి స్వగ్రామం వెళ్ళి రావడానికి ప్రభుత్వం ఖర్చులిస్తుంది. అతనికే కాదు...అతని కుటుంబానికి కుటుంబం అంటే ఏమిటో కూడా నిర్వచించబడింది. అతను, భార్య, కూతుళ్ళు, కొడుకులు, అతనిపై ఆధారపడిన తల్లిదండ్రులు, పెళ్ళికాని చెల్లెళ్ళు ఉద్యోగం చెయ్యని తమ్ముళ్ళు.


ఆ ఉద్యోగి బావిలోని కప్పలాగ కేవలం స్వగ్రామం మాత్రమే వెళ్లిరాకుండా దేశం అంతా తిరిగివస్తేఅతని మేధస్సు పెరుగుతుందనీ, ఇతర ప్రాంతంలోని ప్రజల జీవితవిధానం, ఆచారాలు, కట్టుబొట్లు తెలుస్తాయనీ అభిప్రాయపడింది కాబోలు ప్రభుత్వం. అందుకే ఈ సౌకర్యాన్ని ఆల్ ఇండియా ఎల్.టీ.సీ.గా పొడిగించింది. ఈ సౌకర్యం నాలుగు సంవత్సరాలకు ఒకసారి లభిస్తుంది. తను ఉద్యోగంచేస్తున్న చోటునుంచి ఉద్యోగి కుటుంబంతో సహా భారతదేశంలో ఎక్కడికయినా వెళ్లిరావచ్చు. అందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వం ఇస్తుంది. ఈ సౌకర్యం వాడుకుందుకు ఉద్యోగులు అటు కాశ్మీరు, ఇటు కన్యాకుమారీ ఎన్నుకుంటారు. ఎక్కువ దూరం కనుక, ఆ ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది కనుక చాలా చోట్లు చూసి రావచ్చని ఉద్దేశ్యం. పైగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ భారతదేశం ఒక్కటే అన్న నినాదం కూడా ఒకటి వుంది కదా.

తనకు ఇయ్యబడిన ఏ సౌకర్యాన్నయినా సద్వినియోగం చేసుకోకుండా దుర్వినియోగం చేసుకోవాలనే చూస్తాడు మనిషి. ఆ సౌకర్యం ద్వారా లభించే డబ్బుని దారి ఖర్చులకు వాడుకోకుండా జేబులో వేసుకోవాలన్న ఆలోచన ఏ దుర్ముహూర్తంలో వచ్చిందో తెలియదు గానీ... అందుకు అవకాశం కల్పించేందుకు ప్రతిచోటా ట్రావెల్ ఏజన్సీస్ పుట్టుకు వచ్చాయి... కుక్క గొడుగుల్లాగ.





ఈ ట్రావెల్ ఏజన్సీల వ్యవహారం కూడా చాల తమాషాగా వుంటుంది. ఫలానా ట్రావెల్ ఏజన్సీవారు ఏర్పాటు చేసిన బస్సులో (అటు కాశ్మీరో...ఇటు కన్యాకుమారో...) వెళ్తున్నానని చెప్పి ఉద్యోగి అడ్వాన్సు కోసం అప్లయిచేస్తాడు. ఆ అప్లికేషన్ కూడా అతి త్వరగా ప్రొసెస్ అయిపోయి డబ్బులు ఉద్యోగి చేతిలో పడతాయి. అందుకు కారణం ఆ అప్లికేషన్లు ప్రొసెస్ చెయ్యవల్సిన వాళ్లను కూడా ఆ ట్రావెల్ ఏజంట్లు సంతోష పెడతారు. ఆ డబ్బుతీసుకుని శలవు మీద తన ఊరు వెళ్లి తిరిగి వస్తాడు ఉద్యోగి. ఆ డబ్బు వేలలో వుంటుంది కనుక ఎన్నాళ్ళుగానో కలలు కంటూ కొనుక్కోలేకపోయిన వస్తువు కొనుక్కోవడమో, లేక బ్యాంకు బాలన్సు పెంచుకోవడమో చేస్తాడు ఉద్యోగి. తిరిగి వచ్చిన తర్వాత టిక్కట్టుకి ఇంత అని ఆ ట్రావెల్ ఏజన్సీకి తాంబూలం ఇస్తే వాళ్ళు పూర్తి సొమ్ము మట్టినట్లూ, ఆ ఉద్యోగి సకుటుంబంగా తమ బస్సులో ప్రయాణం చేసి వచ్చినట్లూ సర్టిఫికెట్ ఇస్తారు. ఇంతే సంగతులు. ఊరు దోచుకుని దొంగలు తమలో తాముపంచుకోవడం అన్నమాట. ఇంకేముంది!... సర్వేజనా సుఖినోభవంతు... అందరూ క్షేమమే.

గంజాయి వనంలో తులసి మొక్కలాంటి వాడు సత్యమూర్తి ఈ ఆలిండియా ఎల్.టి.సీ.ఏ ప్రయోజనాలకు ఉద్దేశింపబడిందో ఆ ప్రయోజనాలు పొందాలనుకున్నాడు. ఢిల్లీలో అతనికి చుట్టాలు వున్నారు. ఎప్పట్నుంచో రమ్మని ఉత్తరాలు రాస్తున్నారు. ఈ ఆలిండియా ఎల్.టి.సీ తీసుకుని అటు కాశ్మీరు వెల్లి వస్తే బాగుంటుందని తోచింది. పంజాబు గొడవల్లో వుండగా అటు వెళ్లడం మంచిది కాదని ఒక సజ్జనుడు సలహా ఇచ్చాడు. ఇది కూడా బాగానే వుందనుకున్నాడు. అందుకే ఆలోచించి ఢిల్లీనుంచి బదరీనాథ్ వెళ్లి వస్తే బాగుంటుందనుకున్నాడు. ఈ విషయం ఢిల్లీలోని అతని బంధువులకు రాస్తే వాళ్లు సమర్థించారు. వెంటనే అప్లికేషన్ పెట్టాడు బదరీనాథ్ వెళ్లి రావడానికి. శలవు గ్రాంటు వెంటనే అయిపోయింది, ఆ పని చెయ్యవల్సింది అతని బాసే కనుక. డబ్బులకోసం అప్లికేషన్ ఫార్వర్డ్ కావడం కొంచెం లేటయ్యింది. వెళ్లకుండా వెళ్తున్నామని చెప్పే వాళ్ల అప్లికేషన్లు ప్రొసెస్ అయ్యే టైము కంటే ఇతని విషయంలో ఎక్కువ టైము పట్టింది. బహుశా నిజంగా వెళ్లాలనుకుంటున్నాడు కదా... అదే కారణం



కాబోలు.

మొత్తానికి డబ్బు తీసుకున్నాడు. శలవులో వెళ్ళిపోయేడు. ఢిల్లీవెళ్లి బంధువుల ఇంట్లో కొన్ని రోజులు గడిపాడు. ఊరంతా చూశాడు. ఢిల్లీ నుంచి బదరీనాథ్‌కి ట్రావెల్ బస్సులో టిక్కట్టు బుక్ చేయించుకున్నాడు. (నిజంగా వెళ్ళేబస్సులది). ఒకవారం రోజుల ట్రిప్పుకొట్టి హరిద్వార్, రుషికేష్, రుద్రప్రయాగ్, కేదారనాథ్, జోషీమఠ్, బదరీనాథ్‌లు దర్శించేడు. రుద్రప్రయాగ అన్నది జంక్షను. అక్కడ




నుంచి కేదార్‌నాథ్ వెళ్ళే రూటు వేరు. బదరీనాథ్ వెళ్ళే రూటువేరు. రుద్రప్రయాగ నుంచి కేదార్‌నాథ్ వెళ్ళిన బస్సు మళ్ళీ తిరిగి రుద్రప్రయాగ వచ్చాకనే బదరీనాథ్ వెళ్తుంది. దూరాన్ని బట్టే ఆ ట్రావెలింగ్ కంపెనీ డబ్బు తీసుకుంటుంది కనుక, కానీ అతని ఆఫీసువాళ్లు ఢిల్లీనుంచి బదరీనాథ్ వరకే సొమ్ము ఇస్తారు కనుక రుద్రప్రయాగ నుంచి కేదార్‌నాథ్ వెళ్ళివచ్చే దూరం ఖర్చు అతని స్వంతమే అవుతుంది. ట్రావెలర్ కంపెనీ ఇచ్చిన బిల్లు పూర్తిగా పే చెయ్యబడిందని ముందే అనుకున్నాడు.

మళ్ళీ ఢిల్లీ తిరిగివచ్చి ఇంకొక పది రోజులు వుండి తర్వాత తను ఉద్యోగం చేస్తున్న చోటుకి వచ్చేశాడు. ప్రయాణం ముగించుకుని వచ్చిన పదిహేను రోజులలోగా ఎల్.టి.సి. బిల్లు సబ్మిట్ చెయ్యాలి కనుక... రూలు ప్రకారం నడుచుకునే వాడు కనుక... పది రోజుల్లోనే బిల్లు సబ్మిట్ చేశాడు.

రెండునెలలు గడిచి పోయాయి. అతని బిల్లు పాసైందని తెలిసింది. వివరాలు కనుక్కున్న సత్యమూర్తి ఆశ్చర్యపోయాడు. అతని బిల్లులో వెయ్యి రూపాయలు కట్ చేశారు. సత్యమూర్తికి కళ్ళు తిరిగాయి. ఇలా ఎందుకు జరిగింది! అని ఆశ్చర్యపోయాడు.

వివరాలు తెలుసుకోవాలని వెళ్ళాడు. అతనితో పరిచయం వున్న వాళ్లే కనుక వాళ్ళు వివరాలు చెప్పారు. ట్రైను రూటు రుషీకేష్‌దాకానే వుంది. కనుక అంతవరకే అతనికి డబ్బు ఇచ్చారు. రుషీకేష్ నుంచి బదరీనాథ్ మరో ముప్ఫయి, నలభై కిలోమీటర్ల దూరం వుడొచ్చునని ఊహించి.. సత్యమూర్తికి మహోపకారం చేస్తున్న పద్ధతిలో ఆ నలభైకిలోమీటర్లకి కూడా డబ్బు ఇచ్చారట. కనుక వెయ్యిరూపాయల సొమ్ము కట్ చేశారు.

సత్యమూర్తికి అరికాలి మంట నెత్తి కెక్కింది.

"రుషీకేష్ నుంచి బదరీనాథ్ నలభై కిలోమీటర్లా!" అన్నాడు.

"అని మేం అనుకుంటున్నాం. కాదా!" అన్నారు వాళ్ళు.

దీర్ఘంగా నిట్టూర్చాడు సత్యమూర్తి.

"కాదు బాబూ" ఇంచుమించు మూడు వందల కిలోమీటర్లు. రాను, పోను — ఆరువందలు" అన్నాడు.

"అందుకు మాకు రుజువులు చూపిస్తే ఆ దూరానికి కూడా డబ్బు, ఇస్తాం." అన్నాడు.

నలభై కిలోమీటర్ల దూరం అన్న విషయానికి ఏ రుజువులూ అక్కర్లేకపోయాయి. పాపం" మూడు వందల కిలోమీటర్ల దూరానికి రుజువులు కావాలట?

"అలాగే.." అంటూ వచ్చేశాడు సత్యమూర్తి.

అతని అదృష్టవశాత్తూ అతని స్నేహితుడి దగ్గర ఉత్తరదేశయాత్రతాలూకు ఒక పుస్తకం. టూరిజం డెవలప్‌మెంట్ వాళ్లది దొరికింది. అందులో ఈ దూరాలు రాశారు. అది తీసుకెళ్ళి చూపించాడు.

దూరాన్ని వాళ్ళు నమ్మారు. అందులోనే వున్న సాధారణమైన బస్సు తాలూకూ ఫేరు 35 రూపాయలు అని వుంది. అది కూడా నమ్ముతున్నట్లు ప్రకటించి టిక్కట్టుకి రానుపోను 70 రూపాయలచొప్పున మొత్తం టిక్కట్లకు ఎంత అయ్యిందో అంతా ఇస్తామన్నారు.


మనసులోనే లెక్కగట్టాడు సత్యమూర్తి. అయినా ఎనిమిది వందలు నష్టం.

"డీలక్సు బస్సు ఛార్జీ ఇయ్యాలికదా. రైల్లో నాకు ఫస్టు క్లాసు ఎలాఅయితే డీలక్సు ఛార్జీలు కూడా అన్వయించాలి కదా.." అన్నాడు.

ఒక నిముషం ఆలోచించి.

"అది గవర్నమెంటు వారు నడిపే డీలక్సుబస్సులయితే ఆసొమ్ము ఇస్తాం. రుషీకేష్ నుండి డీలక్సుబస్సులు వున్నాయో లేదో... వుంటే ఫేరు ఎంతో మాకు తెలియదు. ఆ నిజాలు మాకు నిరూపించాలి." అన్నారు.

సీట్లోకి వచ్చి కూర్చుని తలపట్టుకున్నాడు.




ఏమిటిన్ని తిప్పలు! తను ఎందుకిలా అవస్థలు పడవల్సివస్తోంది!

తను నిజంగా ప్రయాణం చేసి వచ్చాడు. అయినా తనకు ఇన్ని కష్టాలు వచ్చాయి.

వెళ్లకుండా ఇంట్లోనే కూర్చున్న వాడి బిల్లు ఏ అభ్యంతరాలూ లేకుండా పాస్ అవుతోందే? టూరిజం వాళ్లకు లెటరు రాశాడు.

వాళ్ళ దగ్గర్నుంచి ఇంకా జవాబు ఏదీ రాలేదు.

అక్కడ నుంచి జవాబు వస్తుందనీ... తనకు అన్యాయం జరగదనీ నమ్ముతున్నాడు సత్యమూర్తి వేచి చూడాలి మరి ఏం జరుగుతుందో.

ఈలోగా సత్యమూర్తి మాత్రం ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

నిజాయితీగా ప్రయాణం చేసి బావుకున్నది ఏముంది! తను కూడా ఇకముందు ఆ ట్రావెల్స్ ఏజెన్సీలని ఆశ్రయించి ఆల్ ఇండియా యల్.టి.సి పేరు మీద ఇంటికి వెళ్ళి ఆ డబ్బు మిగుల్చుకుంటాడు. అంతకీ దేశం తిరిగిరావాలన్న కోరిక చంపుకోలేకపోతే ఆ శలవులో ఇంటికి వెళ్లడం మానేసి సెకండ్ క్లాసులో వెళ్లివస్తాడు. ఏజన్సీవాళ్ల టిక్కట్టే ప్రొడ్యూస్ చేస్తాడు కనుక తనకు తప్పకుండా డబ్బులు మిగులుతాయి. అదే మంచి మార్గం. డబ్బులు పాస్ కావడంలో కూడా ఏ మాత్రం అడ్డంకులు వుండవు. అదండీ సంగతి. ఈ రకంగా ప్రస్తుతం వున్న దొంగల సంఖ్యకి ఒకటి కలుపబడింది. సత్యమూర్తి కారణంగా.

ఇదీ.. దొంగల ఫ్యాక్టరీ కథ.

* * *

దొంగల ఫ్యాక్టరీ అంటే నా ఉద్దేశ్యం దొంగల యొక్క ఫ్యాక్టరీ అని కాదు. దొంగల కొరకు నడపబడుతున్న ఫ్యాక్టరీ అని కూడా కాదు. దొంగల్ని తయారు చేస్తున్న ఫ్యాక్టరీ అని. *